సంపుటి :02 సంచిక :295 పేజీలు :07 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 30, జనవరి 2026

## కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- ముఖ్యమంత్రి జిల్లాల పర్యటన ఖరారు
- 6న భూపాలపల్లికి సీఎం రేవంత్ రెడ్డి
- బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు

05



## కేసీఆర్ విచారణపై సిట్ కసరత్తు

- నేడో, రేపో మళ్లీ ఆయనకు నోటీసులు
- విచారణ స్థలంపై న్యాయ సలహా తీసుకున్న సిట్
- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నియామకంపై ప్రధానంగా ప్రశ్నలు?
- కీలక విషయాలపై మరికొన్నిప్రశ్నలు సంధించే అవకాశం

05





# మేడారం.. జనారణ్యం!

- గద్దెలపై కొలువుదీరిన వనదేవతలు..

- పోటెత్తిన భక్తజనం
- నిలువెత్తు 'బంగారం'తో మొక్కులు..
- పులకించిన వనం
- దర్శించుకున్న గవర్నర్, మంత్రులు..
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

ములుగు జిల్లాలోని అడవి తల్లి గర్భం భక్తజన సంద్రమైంది. 'జై సమ్మక్క.. జై సారలమ్మ' అనే నామస్మరణతో అరణ్యం ప్రతిధ్వనిస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా మేడారం జాతర మూడో రోజు పతాక స్థాయికి చేరింది. సమ్మక్క-సారలమ్మలు గద్దెలపై కొలువుదీరడంతో మొక్కులు చెల్లించుకోవడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భక్తులు ఇసుకేస్తే రాలనంతగా తరలివచ్చారు. క్యూలైన్లు కిలోమీటర్ల మేర బారులు తీరగా.. జంపన్న వాగు పుణ్యస్నానాలతో పులకించిపోయింది.

– అక్షర దర్బార్, మేడారం

04



తల్లులను దర్శించుకుంటున్న గవర్నర్, చిత్రంలో మంత్రి సీతక్క

## మేడారంలో ఖాకీల వీరంగం

- భక్తులపై లాఠీలతో విరుచుకుపడిన పోలీసులు
- పిడిగుద్దులు గుద్దడంపై భక్తుల నిరసన

05



## చివరి రోజు నామినేషన్ల కోలాహలం

- ముగిసిన నామినేషన్ల దాఖలు గడువు
- ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో సందడి
- తమ అనుచరులు, అనుయాయులతో కలిసి భారీ ర్యాలీలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు
- బీఫారం సంగతి పక్కన పెట్టి కొందరు పత్రాలు దాఖలు
- ప్రధాన పార్టీల నుంచి పోటాపోటీగా నామినేషన్లు
- రేపు నామినేషన్ల పరిశీలన

03

## రాజకీయ పార్టీలు సహకరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం

05

# జాతరలో ఖాకీల వీరంగం

- భక్తులపై లాఠీలతో విరుచుకుపడిన పోలీసులు
- పిడిగుద్దులు గుద్దడంపై భక్తుల నిరసన



అక్షరదర్బార్, మేడారం : పవిత్రమైన మేడారం సమ్మక్క– సారలమ్మ మహాజాతరలో పోలీసులు వీరంగం సృష్టించారు. భక్తులకు భద్రత కల్పించాల్సిన రక్షణ కవచాలే.. భక్షకులుగా మారి సామాన్య భక్తులపై లాఠీలతో విరుచుకుపడ్డారు. పోలీసుల ప్రవర్తనతో మేడారం జాతర ప్రాంగణం యుద్ధభూమిని తలపించింది.

**- సమ్మక్క గడప వద్ద..**

అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులపై ఏఆర్ పోలీసులు, గ్రేహౌండ్స్ బలగాలు కనికరం లేకుండా విరుచుకుపడ్డాయి. సమ్మక్క ప్రధాన ద్వారం వద్ద భక్తులను ఈడ్చుకెళ్లి, సీఐ స్థాయి అధికారి సహా సిబ్బంది పిడిగుద్దులు గుద్దడం కలకలం రేపింది. పోలీసుల లాఠీచార్జీలో పలువురు భక్తులు తలలు పగిలి, రక్తగాయాలతో విలవిలలాడారు. పోలీసుల అతి ప్రవర్తనతో ఆగ్రహం కట్టలు తెంచుకున్న భక్తులు, వారిపైకి చెప్పులు విసిరి నిరసన తెలిపారు.

**- మంత్రి కాన్వాయ్ పై దాడి**

పోలీసుల తీరుపై మండిపడుతున్న భక్తుల ఆగ్రహం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాన్వాయ్‌పైకి మళ్లింది. భక్తులు మంత్రి వాహనంతో పాటు ఎస్కార్ట్ వాహనాల అద్దాలను పగలగొట్టారు. వేల సంఖ్యలో పోలీసు బలగాలు ఉన్నా, మంత్రి కాన్వాయ్‌పై దాడి జరగడం భద్రతా యంత్రాంగం వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. శాంతిభద్రతలు కాపాడాల్సిన ఉన్నతాధికారులే స్వయంగా లాఠీలు పట్టి భక్తులపై వీరంగం సృష్టించడం విమర్శలకు తావిస్తోంది. ఓ ఏఎస్పీ, సీఐ సహా పలువురు అధికారులు భక్తులపై అమానుషంగా దాడి చేశారని క్షేత్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి.

**- భక్తుల ఆవేదన**

"అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తే.. పోలీసులు మమ్మల్ని జంతువులకంటే హీనంగా కొడుతున్నారు" అంటూ భక్తులు కన్నీరు మున్నీరవుతున్నారు. మహాజాతర ఏర్పాట్లలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యాయని భక్తులు ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. అడుగడుగునా భక్తులను వేధిస్తున్న పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## 18వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి కరుణ నామినేషన్



అక్షరదర్బార్,పరకాల: పరకాల పట్టణ 18వ వార్డు నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రేగురి కరుణ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగురి విజయపాల్ రెడ్డి, ఏకు శుభాష్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 18వ వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో రేగురి కరుణ ముందుండి పనిచేస్తారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పరకాల పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు.

## 14వ వార్డులో దూసుకుపోతున్న బీఆర్ఎస్

### అభ్యర్థి దీప్తి రాకేష్ రావుకు ప్రజల ఆశీర్వాదం





అక్షర దర్బార్,పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 14వ వార్డులో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. 14వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దీప్తి రాకేష్‌రావు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజల మద్దతు కూడగట్టారు. అదేవిధంగా నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు ప్రజలు అభ్యర్థిని ఆశీర్వదిస్తూ తమ ఓటు మీకేనని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ముస్లిం ప్రాంతంలో నిర్వహించిన ప్రచారంలో ముస్లిం పెద్దలు ప్రత్యేకంగా ప్రార్థనలు చేసి దీప్తి రాకేష్‌రావును ఆశీర్వదించారు. దీనితో అభ్యర్థి హర్షం వ్యక్తం చేశారు.వార్డు ప్రజల ఆశీర్వాదంతో రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని దీప్తి రాకేష్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జాకీర్ అలీ, పాడి భగవాన్ రెడ్డి, బండి వెంకటేష్, బీయబాని, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# మేడారంలో భక్తుల కోలాహలం



అక్షరదర్బార్, మేడారం: తెలంగాణ కుంభ మేళాగా పిలవబడే మేడారం సమ్మక్క– సారలమ్మ జాతరలో భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఈ ఏడాది ప్రభుత్వం, అధికారులు చేసిన అత్యుత్తమ ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏళ్లతో పోలిస్తే ఈసారి దర్శనం చాలా వేగంగా జరుగుతోందని భక్తులు తెలిపారు. గతంలో 5– 6 గంటలు పట్టే దర్శనం, ఈసారి కేవలం 2 గంటల్లోనే పూర్తవుతోందని మంచిర్యాల నుండి వచ్చిన భాను చందర్ దేవరకొండ దంపతులు పేర్కొన్నారు.

**- మెరుగైన వసతులు**

రోడ్ల విస్తరణ, రవాణా సౌకర్యాలు, తాగునీటి ఏర్పాట్లు చాలా బాగున్నాయని భక్తులు కొనియాడారు. గోదావరిఖని నుండి వచ్చిన పుష్ప మాట్లాడుతూ, గతేడాది కంటే ఈ ఏడాది వసతులు ఎంతో బ్రహ్మాండంగా ఉన్నాయని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ మరియు భక్తుల క్యూ లైన్ల నిర్వహణలో పోలీస్ యంత్రాంగం అందిస్తున్న సహకారం అభినందనీయమని విజయవాడ నుండి వచ్చిన నిజాం మొహిద్దీన్ బృందం తెలిపింది.

**- గ్రామీణ భక్తుల రాక**


కాగజ్‌నగర్, బురదగూడ వంటి మారుమూల గ్రామాల నుండి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాదాపు 50 మందితో కలిసి బస్సులో వచ్చిన భక్తులు, జాతరలో తమకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని సంతోషం వ్యక్తం చేశారు. సమ్మక్క– సారలమ్మ తల్లులపై ఉన్న అచంచల విశ్వాసంతో ప్రతి రెండేళ్లకు ఒకసారి వస్తున్నామని, ఈసారి దర్శన ఏర్పాట్లు మరియు శుభ్రత విషయంలో తీసుకున్న జాగ్రత్తలు తమకు ఎంతో తృప్తినిచ్చాయని భక్తులు ముక్తకంఠంతో చాటుతున్నారు.

## జాతరలో సింగరేణి రెస్క్యూ సేవలు



అక్షరదర్బార్, మేడారం : మేడారం మహా జాతరలో సమ్మక్క సారలమ్మ దర్శనార్థం రోజు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి తమ మొక్కలు చెల్లించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జాతర లో సింగరేణి రెస్క్యూ సిబ్బంది అద్భుతమైన సేవలు అందిస్తున్నారు. సుమారు 40 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది మూడు బ్యాచులుగా విడిపోయి గద్దెల ప్రాంగణంలో భక్తులు విసిరిన కొబ్బరి చిప్పలు, బెల్లం ఉండలు తగిలి గాయాలపాలైన వారిని గద్దెల ప్రాంగణంలో అనారోగ్యంతో అస్వస్థతకు గురైన భక్తులకు సహాయక చర్యలు అందిస్తూ వారిని ఆసుపత్రికి అంబులెన్స్ వద్దకు చేరుస్తున్నారు. ఈ సహాయక చర్యలు పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి రెస్క్యూ సిబ్బంది ప్రతి మేడారం జాతరకు సేవలు అందించడం అనవాయితీగా వస్తుందని రెస్క్యూ సిబ్బంది తెలిపారు.

## ఆకట్టుకుంటున్న జాయింట్ వీల్స్



అక్షరదర్బార్, మేడారం : ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం శ్రీ సమ్మక్క– సారలమ్మ మేడారం జాతర. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ మహా జాతరలో తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, ఛత్తీస్గడ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరు అవుతారు. ఆదివాసి, గిరిజన సాంప్రదాయాలు, విలువలకు ప్రతీకగా నిలిచే ఈ జాతరలో అమ్మవారి గద్దెల నుంచి జంపన్న వాగు వెళ్లే దారిలో అతి భారీ సర్కస్ విన్యాసాలు, జాయింట్ వీల్స్, పిల్లల ఆటల పోటీలు నిర్వహించే తదితర స్టాల్స్ భక్తులను, ప్రజలను, పిల్లలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సర్కస్ విన్యాసాలలో అమ్మవారి దర్శనం అనంతరం ఎంజాయ్ చేస్తూ క్రీడలు ఆడుతున్నారు,
జంపన్న వాగు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ కాంతులతో జంపన్న వాగు తోరణాలు తదితర ప్రదేశాలు ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తినుబండారాలు, చాయ్, టిఫిన్స్, ఐస్ క్రీమ్స్, తదితర పదార్థాలు తింటూ ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు. మరోవైపు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా పోలీస్ యంత్రాంగం రక్షణ చర్యలు చేపడుతూ నిత్యం ప్రజలను గమనిస్తూ ఉన్నారు. మేడారం జాతరలో సర్కస్ జాయింట్ వీల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. జంపన్న వాగులో నిత్యం భక్తులు పుణ్య స్థానాలు ఆచరిస్తూ ఉల్లాసంగా భక్తి పరవశంలో మునిగిపోతున్నారు. జంపన్న వాగు ప్రాంతంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిస్సింగ్ క్యాంపు ఏర్పాటుచేసి తప్పిపోయిన భక్తుల వివరాలను ఎప్పటికప్పుడు అనౌన్స్మెంట్ మైకు ద్వారా చేస్తూ 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటు సేవలు అందిస్తున్నారు.





# చివరి రోజు నామినేషన్ల కోలాహలం

- ముగిసిన నామినేషన్ల దాఖలు గడువు
- ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో సందడి
- తమ అనుచరులు, అనుయాయులతో కలిసి భారీ ర్యాలీలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు
- బీఫారం సంగతి పక్కన పెట్టి కొందరు పత్రాలు దాఖలు
- ప్రధాన పార్టీల నుంచి పోటాపోటీగా నామినేషన్లు
- రేపు నామినేషన్ల పరిశీలన

అక్షరదర్బార్, వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో చివరి రోజైన శుక్రవారం నామినేషన్ దాఖలు ప్రక్రియ కోలాహలంగా జరిగింది. నామినేషన్ దాఖలు చేయాల్సిన అభ్యర్థులు తమ అనుచరగణంతో భారీ ర్యాలీలు నిర్దహించి కేంద్రాలకు వచ్చారు. మహబూబాబాద్, పరకాల, డోర్నకల్, మరిపెడ, నర్సంపేట, భూపాలపల్లి మున్సిపాలిటీల్లో అభ్యర్థులు పోటాపోటీగా తరలివచ్చారు. ములుగు, కేసముద్రం, వర్ధన్నపేట, తొర్రూరు, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ పట్టణాల్లోనూ నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఉత్సాహంగా సాగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి భారీ ర్యాలీలు తీయడంతో వీధులన్నీ జనసంద్రంగా మారాయి. పార్టీలు బీ ఫారం ఇచ్చే సంగతి తర్వాత చూసుకుందాం ముందైతే నామినేషన్ వేద్దామన్న ధీమా చాలామంది అభ్యర్థుల్లో కనిపించింది. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే ఉపసంహరణ లోపు సర్దుబాటు చేసుకుందామన్న ఆలోచనతో ఉత్సాహంగా పత్రాలు దాఖలు చేశారు. ఈ ర్యాలీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రధాన రాజకీయ పార్టీల నియోజకవర్గ ఇన్చార్జీలు, సమన్వయకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని అభ్యర్థుల్లో జోష్ నింపారు. సాయంత్రం ఐదు గంటల వరకు కార్యాలయాలకు చేరుకున్న వారి నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించారు.

### - రేపు నామినేషన్ల పరిశీలన

నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జనవరి 31న జరుగుతుంది. నామినేషన్లు తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఫిబ్రవరి 1న అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ కేసులను ఫిబ్రవరి 2న అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. అదే రోజున అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. దీంతో ఎన్నికల క్షేత్రంలో నిలిచే అభ్యర్థులపై పూర్తి స్పష్టత రానుంది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో

### - 11న పోలింగ్

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 11న జరుగుతుంది. ఫిబ్రవరి 13వ తేదీన ఎన్నికల అధికారులు, సిబ్బంది ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి తెరపడనుంది. అభ్యర్థులకు ప్రచారం కోసం కేవలం ఆరు రోజులు మాత్రమే సమయం అందుబాటులో ఉంటుంది. తక్కువ సమయం ఉండటంతో అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రచార వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని మున్సిపల్ రాజకీయ సమీకరణాలను మారుస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. 16న ఆయా మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక జరగనుంది.



## ఆడబిడ్డగా వస్తున్న ఆశీర్వదించండి

### బీఆర్ఎస్ 12వ వార్డు అభ్యర్థి గంట కళావతి

అక్షరదర్బార్,పరకాల: "ఆడబిడ్డగా వస్తున్న నన్ను ఆశీర్వదించాలి" అని బీఆర్ఎస్ 12వ వార్డు అభ్యర్థి గంట కళావతి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మరెడ్డి ఆశీస్సులతో ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా గంట కళావతి మాట్లాడుతూ, తాను నిత్యం 12వ వార్డు ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి ఓటర్లు ఆశీర్వదిస్తే, వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్ కు మరో షాక్..

### బీఆర్ఎస్ లో చేరిన దుబాసి వెంకటస్వామి

అక్షరదర్బార్,పరకాల: పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు దుబాసి వెంకటస్వామి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)లో చేరారు. గురువారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో ఆయన బిఆర్ఎస్‌లో చేరడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. వెంకటస్వామితో పాటు కాంగ్రెస్‌కు చెందిన బొచ్చు సతీష్, దండ్ర వెంకట్, ఒంటేరు బాబురావు, కోగిల సుధాకర్ తదితరులు కూడా బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందుకే నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు.



## అమరవీరులకు అంబేద్కర్ యూత్ నివాళి

అక్షర దర్బార్, చిట్యాల: దేశం, సమాజం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమర వీరులకు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలో ఘన నివాళులు అర్పించారు. అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ, మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. నేటి తరం వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, మండల నాయకులు పాముకుంట్ల చందర్ పాల్గొన్నారు.

## తప్పిపోయిన చిన్నారి

### తల్లిదండ్రులకు అప్పగించిన దామెర పోలీసులు



అక్షర దర్బార్,పరకాల: దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్ సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో తప్పిపోయిన చిన్నారిని పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన బండారి కిరణ్ రెండు సంవత్సరాల పాప రష్మిక గురువారం ఉదయం జాతర సందర్భంగా జనసందోహంలో తల్లిదండ్రుల నుంచి తప్పిపోయింది. సమాచారం అందుకున్న దామెర పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టి చిన్నారిని గుర్తించారు.అనంతరం పాపను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల తక్షణ స్పందనతో చిన్నారి సురక్షితంగా లభించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## నకిలీ టీ పౌడర్ స్వాధీనం..

### గుర్తించే విధానంపై డెమో ఇచ్చిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



అక్షర దర్బార్, పరకాల: నకిలీ టీ పౌడర్ విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు ఉమ్మడి తనిఖీలు నిర్వహించారు. గురువారం గూడెప్పాడ్ సెంటర్ సమీపంలోని ఎంఎం మార్ట్ లో తనిఖీలు చేపట్టిన అధికారులు సుమారు 40 కిలోల నకిలీ టీ పౌడర్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు కృష్ణమూర్తి, మౌనిక లు నకిలీ టీ పౌడర్‌ను ఎలా గుర్తించాలో డెమో చేసి చూపించారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఈ తనిఖీల్లో పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, శాయంపేట ఎస్సై పరమేశ్వర్, దామెర ఎస్సై కొంక అశోక్ పాల్గొన్నారు. నకిలీ ఆహార పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### హెయిర్ డై కలిపిన నకిలీ టీ పౌడర్

స్వాధీనం చేసుకున్న నకిలీ టీ పౌడర్‌ను హెయిర్ డై (జుట్టుకు వేసే రంగు) వంటి హానికర రసాయనాలతో తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇలాంటి రసాయనాలు వాడడం వల్ల ప్రజలు క్యాన్సర్ సహా ఇతర ప్రమాదకర వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. కావున ప్రజలు నకిలీ టీ పౌడర్‌ను వినియోగించవద్దని, నాణ్యమైన, ధృవీకరించిన ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని సూచించారు.

## 215 నామినేషన్లు

### - పరకాల మున్సిపల్ నామినేషన్ల దాఖలుకు తెర
### - చివరి రోజున దరఖాస్తుల వెల్లువ

అక్షరదర్బార్, పరకాల:పరకాల మున్సిపాలిటీలో నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజున భారీ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ కేంద్రాలు కిటకిటలాడాయి. పట్టణంలోని 22 వార్డులకు గాను వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీకి దిగారు.అధికారుల వివరాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ తరపున అత్యధికంగా 66 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తలో 44 నామినేషన్లు సమర్పించాయి. బీఎస్పీ నుంచి 15, సీపీఎం నుంచి 3 నామినేషన్లు వచ్చాయి. ఇతర పార్టీలు కలిపి 17 నామినేషన్లు దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 26 నామినేషన్లు అందాయి. మొత్తంగా 215 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీ రూపు దాల్చనుందని, ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# మహాజాతరకు వీఐపీల తాకిడి

- గద్దెల వద్ద గవర్నర్ జిష్ణదేవ్ వర్మ ప్రత్యేకపూజలు
- మంత్రులు సీతక్క, కొండా సురేఖ, డీజీపీ శివధర్‌రెడ్డి కూడా..
- ఇదే వరసలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తదితరులు

అక్షరదర్బార్, మేడారం : మేడారం మహాజాతకు మూడో రోజు శుక్రవారం భారీగా వీఐపీల తాకిడి ఉంది. వనదేవతలను దర్శించుకునేందుకు ప్రముఖులు క్యూ కట్టారు. వీరిలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా ఉన్నారు. గవర్నర్‌కు ప్రభుత్వ అధికారులు, పోలీసులు ఘన స్వాగతం పలికారు. గద్దెల వద్ద గవర్నర్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సైతం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ఆయన అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గ్యారత్ వెన్ ఓవెన్ మేడారం రాక అందరినీ ఆకర్షించింది. ఆయన భారతీయ సంప్రదాయ హ్యాండ్లూమ్ వస్త్రధారణలో వచ్చి తులాభారం మొక్కు చెల్లించుకున్నారు. జాతర విశిష్టతను ఆయన ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తన కుటుంబ సభ్యులతో కలిసి దేవతలను దర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల తరపున అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ అమ్మవార్లను దర్శించుకున్నారు. కలెక్టర్ టి ఎస్ దివాకర్ ప్రముఖులకు జాతర ఏర్పాట్లను వివరించారు. శాసనమండలి సభ్యుడు బసవరాజు సారయ్య తన కుటుంబంతో కలిసి వచ్చి నిలువెత్తు బంగారం సమర్పించారు. పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ వనదేవతల ఆశీస్సులు తీసుకున్నారు. వివిధ నియోజకవర్గాల శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, పాయం వెంకటేశ్వర్లు గద్దెల వద్ద పూజలు చేశారు. సికింద్రాబాద్ కాంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దంపతులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా పెద్ద సంఖ్యలో మేడారం చేరుకున్నారు. డీజీపీ శివధర్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా వనదేవతలకు మొక్కులు చెల్లించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దేవసేన దేవతలకు బంగారం సమర్పించారు. పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురాం దర్శనం చేసుకున్న వారిలో ఉన్నారు. అధికారులు, ప్రముఖుల రాకతో మేడారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది.



# బీఆర్ఎస్ పార్టీ ఫామ్-ఏ అందజేత

## అదనపు కలెక్టర్ రవికి పత్రాలు సమర్పించిన నేతలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ తరఫున పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచనల మేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రవికి బీఆర్ఎస్ పార్టీ ఫామ్–ఏను అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మాజీ ఎంపీపీ శ్రీనివాస రెడ్డి, దామెర మాజీ వైస్ ఎంపీపీ జాకిర్ అలి పాల్గొని పార్టీ తరఫున ఫామ్–ఏను సమర్పించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన పార్టీ ప్రక్రియలను నిబంధనల మేరకు పూర్తి చేస్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు







- ఇసుకేస్తే రాలనంత భక్తుల రాక
- మూడోరోజు మేడారం జాతర పరిసరాలు కిటకిట
- జంపన్న వాగు వద్ద పుణ్యస్నానాలు
- ఎత్తు బెల్లం సమర్పించి తనవితీర మొక్కులు
- వన దేవతలను దర్శించుకున్న ప్రముఖులు
- మొక్కులు చెల్లించుకున్న గవర్నర్, మంత్రులు, డీజీపీ, ఎంపీ, ఎమ్మెల్యేలు
- వాహనాలతో కిక్కిరిసిపోయిన రహదారులు
- రేపు సాయంత్రం ఆరాధ్యదైవాల వనప్రవేశం

# పోటెత్తిన భక్తులు

**అక్షరదర్బార్, మేడారం :**

మేడారం మహాజాతర మూడో రోజు భక్తజన సంద్రమైంది. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ గద్దెలపై కొలువుదీరడంతో శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు. మొదటి రెండు రోజుల కంటే మూడో రోజు రద్దీ విపరీతంగా పెరిగింది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి జనం పోటెత్తారు. మేడారం పరిసరాలన్నీ జనారణ్యంగా మారాయి. జంపన్న వాగు నుంచి గద్దెల వరకు ఎక్కడ చూసినా భక్తులే కనిపిస్తున్నారు. భక్తులు వాగులో పుణ్యస్నానాలు ఆచరించి వనదేవతల దర్శనానికి వెళ్తున్నారు. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను పూజారులు బుధవారం గద్దెలపైకి చేర్చారు. గురువారం రాత్రి సమ్మక్క తల్లి గద్దెపైకి రావడంతో జాతర పతాక స్థాయికి చేరుకుంది. శుక్రవారం ఉదయం నుంచే లక్షలాది మంది భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. భక్తుల రద్దీతో తాడ్వాయి– మేడారం రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. దాదాపు 8 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సులు, ప్రైవేట్ వాహనాలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

**- జాతర కిటకిట**

వనదేవతలకు భక్తులు తమ నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కొత్తగా నిర్మించిన క్యూ లైన్ కాంప్లెక్స్ నిండిపోయింది. జనం రోడ్లపైన కిలోమీటర్ల మేర వేచి చూస్తున్నారు. గంటగంటకు రద్దీ పెరుగుతుండటంతో దర్శనానికి చాలా సమయం పడుతోంది. మేడారం అడవి ప్రాంతమంతా 'జై సమ్మక్క.. జై సారలమ్మ' నినాదాలతో మారుమోగుతోంది. శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో వనమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మంత్రులు, ఉన్నతాధికారులు గద్దెల వద్దే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. విద్యుత్ దీపాల వెలుగులతో మేడారం మెరిసిపోతోంది. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు. రేపు శనివారం సాయంత్రం వనదేవతల వన ప్రవేశంతో జాతర ముగియనుంది.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ

- దానంపై పిటిషనర్ల నుంచి వాంగ్మూలాలు
- కీలక సాక్ష్యాల నమోదు
- దానం పార్టీ మారినట్లు ఆధారాలు సమర్పించిన ఎమ్మెల్యే పాడి
- వ్యక్తిగత హాజరుకు కొంత సమయమివ్వాలని కోరిన బీజేపీ నేత ఏలేటి

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణను వేగవంతం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై శుక్రవారం ఆయన సుదీర్ఘంగా విచారణ జరిపారు. ప్రధానంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై స్పీకర్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల వాదనలు విన్న అనంతరం సాక్ష్యాలను నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ విచారణకు పాడి కౌశిక్ రెడ్డి వ్యక్తిగతంగా హాజరై ఎమ్మెల్యే పార్టీ మారినట్లు తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు సమర్పించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బుధవారమే తన అఫిడవిట్‌ను స్పీకర్‌కు అందజేశారు. తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదని, ఇప్పటికీ సాంకేతికంగా ఆ పార్టీ సభ్యుడినేనని ఆయన అందులో పేర్కొన్నారు. గతేడాది మార్చిలో తాను కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలోనేనని, దానిని పార్టీ మార్పిడిగా పరిగణించలేమని దానం వాదించారు. అయితే ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేసిన రికార్డులను పాడి కౌశిక్ రెడ్డి స్పీకర్ ముందు ఉంచారు. బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా తనకు మరింత సమయం కావాలని కోరడంతో ఆయన పిటిషన్‌పై విచారణ ఫిబ్రవరికి వాయిదా పడింది. మరోవైపు పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రెండు వారాల్లోగా ఈ ప్రక్రియపై నివేదిక ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశించింది. గతంలోనే అరికెపూడి గాంధీ సహా ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్, మిగిలిన పిటిషన్లపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. విచారణ అనంతరం స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు సమగ్ర నివేదికను సమర్పించనుంది. ఈ విచారణ ఫలితం తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు దారితీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కేసీఆర్ విచారణపై సిట్ కసరత్తు



- నేడో, రేపో మళ్లీ ఆయనకు నోటీసులు
- విచారణ స్థలంపై న్యాయ సలహా తీసుకున్న సిట్
- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నియామకంపై ప్రధానంగా ప్రశ్నలు?
- కీలక విషయాలపై మరికొన్నిప్రశ్నలు సంధించే అవకాశం

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విచారణపై సిట్ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఈ అంశంపై శుక్రవారం న్యాయ నిపుణులతో సిట్ అధికారులు సుదీర్ఘంగా భేటీ అయ్యారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే అంశంపై ఇప్పటికే స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. న్యాయ సలహా తీసుకున్న తర్వాత కొత్త తేదీతో రెండోసారి నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. దర్యాప్తులో వెలుగుచూసిన కీలక విషయాల ఆధారంగా ఆయనను ప్రశ్నించేందుకు సిట్ సిద్ధమైంది. విచారణకు హాజరైన ఇతరులు ఇచ్చిన వాంగ్మూలాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నియామకంపై అధికారులు ఆరా తీయనున్నారు. రిటైర్ అయిన తర్వాత కూడా ఆయనను ఓఎస్డీగా కొనసాగించడం వెనుక ఉన్న కారణాలను కేసీఆర్ ముందు ఉంచనున్నారు. రాధా కిషన్‌రావు సుదీర్ఘ కాలం పదవిలో ఉండటం వెనుక ఉన్న రాజకీయ నిర్ణయాల గురించి ప్రశ్నించనున్నారు. ఇవన్నీ పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయాలా లేక ప్రభుత్వ ఆదేశాలా అన్న కోణంలో ప్రశ్నలు సిద్ధం చేశారు. విచారణ ప్రక్రియ పూర్తయిన వెంటనే తుది ఛార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేయనున్నారు.

**- మరోసారి కేటీఆర్, హరీశ్ విచారణ**

కేసీఆర్ విచారణకు ముందే కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావును మరోసారి విచారించే అవకాశం కనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికల కారణంగా తాను విచారణకు హాజరు కాలేనని కేసీఆర్ ఇప్పటికే సిట్‌కు లేఖ రాశారు. 65 ఏళ్లు పైబడిన వారు కావడంతో నిబంధనల ప్రకారం తమ నివాసంలోనే విచారణ జరపాలని ఆయన కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు తదుపరి తేదీని త్వరలోనే ఖరారు చేయనున్నారు. ఈ కేసులో మరిన్ని ఆధారాలు సేకరించేందుకు సిట్ తన దర్యాప్తును వేగవంతం చేసింది.



## కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- ముఖ్యమంత్రి జిల్లాల పర్యటన ఖరారు
- 6న భూపాలపల్లికి సీఎం రేవంత్ రెడ్డి
- బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు

అక్షరదర్బార్, హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 6వ తేదీన భూపాలపల్లిలో పర్యటించనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పార్టీ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఆయన ఈ భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఫిబ్రవరి 3 నుంచి 8వ తేదీ వరకు సీఎం చేపట్టనున్న సుడిగాలి పర్యటనలో భూపాలపల్లి సభ అత్యంత కీలకం కానుంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన నెలాఖరుకు హైదరాబాద్ చేరుకుని ఫిబ్రవరి 3న మిర్యాలగూడ నుంచి ప్రచారాన్ని ప్రారంభిస్తారు. 4న జగిత్యాల, 5న చేవెళ్ల పర్యటనల అనంతరం 6వ తేదీన భూపాలపల్లి గడ్డపై ఎన్నికల శంఖారావం పూరిస్తారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన, బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు శుక్రవారంతో ముగియడంతో రాజకీయం మరింత వేడెక్కింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లితో పాటు పరకాల, మహబూబాబాద్, జనగామ, నర్సంపేట, తొర్రూరు వంటి పట్టణాల్లో ప్రచార పర్వం ఊపందుకుంది.

## పశ్చిమ 'బూత్ లెవెల్ ఏజెంట్ల' జాబితా అందజేత

అక్షరదర్బార్, హనుమకొండ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సర్వే–సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కసరత్తు పూర్తి చేసింది. నియోజకవర్గ పరిధిలోని మొత్తం 244 పోలింగ్ బూత్‌లకు సంబంధించి బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) దరఖాస్తులను శుక్రవారం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి స్నేహ శబరీష్ కు అందజేశారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్‌రామ్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఈ జాబితాను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా సవరణ అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

## ప్రజా సేవ కోసం వస్తున్నా

**- 11వ వార్డు అభ్యర్థి బిర్రు వెంకన్న**

**నేడు నామినేషన్ దాఖలు**



అక్షర దర్బార్, కేసముద్రం : పదవి కోసం కాదని, ప్రజలే ఊపిరిగా పనిచేస్తానని బిఆర్ఎస్ మండల నాయకులు 11వ వార్డు అభ్యర్థి బిర్రు వెంకన్న అన్నారు. శుక్రవారం నాడు 11వ వార్డు అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వార్డు మెంబర్‌గా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. తనను ఆదరిస్తే 11వ వార్డును మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడే వ్యక్తి అని, ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజల అవసరాలను తీరుస్తానని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ పార్టీ తరపున తనకు బీఫామ్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను 11వ వార్డుకు చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందన్నారు. 11వ వార్డు ప్రజలందరూ తనను ఆశీర్వదించి మరొక్కసారి అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు.

## జోగంపల్లి సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం జోగంపల్లి గ్రామ శివారులో జరుగుతున్న మినీ మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తల్లుల చల్లని దీవెనలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలు సహకరించాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

అక్షరదర్బార్, వరంగల్: పురపాలక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆమె రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాలు, ఎన్నికల ఖర్చుల నియంత్రణపై చర్చించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, డీపీవో కల్పన, బీజేపీ పార్టీ తరపున హరిశంకర్, వైఎస్సార్‌సీపీ తరపున రజినీకాంత్, బీఎస్పీ పార్టీ తరపున అనిల్ కుమార్, ఏఐ ఎంఐఎం నుంచి సయ్యద్ ఫైజుల్లా తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గాంధీజీ సిద్ధాంతాలే సమాజానికి దిశానిర్దేశం

- ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్
- హనుమకొండ డీసీసీ భవన్ లో ఘనంగా జాతిపిత వర్ధంతి
- 'సర్వోదయ చరక సంఘటన్' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏఐసీసీ నేత
- చరకంతో నూలు వడికి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు



అక్షరదర్బార్, హనుమకొండ: జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) భవనంలో గురువారం నివాళులర్పించే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరై, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆమె 'సర్వోదయ చరక సంఘటన్' కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. గాంధీజీ సైద్ధాంతిక విలువలకు చరక ఒక ప్రతీక అని కొనియాడారు.

**- ఆచరణలో గాంధీయం**

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గాంధీజీ ఆశయాలను సిద్ధాంతాలుగా మలుచుకుని ప్రజాసేవలో ముందుకు సాగుతోందని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన మార్గం నేటి తరానికి ఎంతో అవసరమని అన్నారు. ముందుగా హనుమకొండకు విచ్చేసిన మీనాక్షి నటరాజన్‌కు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులందరూ చరకపై నూలు వడికి స్వదేశీ స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్ రావు, దుద్దిళ్ల శ్రీనుబాబు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జాతీయ కో–ఆర్డినేటర్ పులి అనిల్, వివిధ విభాగాల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జన మేడారం






























# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915